క్లుప్తంగా

నియామక పత్రం అందజేత



ఫీల్డ్ అసిస్టెంట్ నాగమణికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని టి.సిరసపల్లి ఫీల్డ్ అసిస్టెంట్‌గా దాడి నాగమణిని నియమించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు బుధవారం ఆమెకు ఎమ్మెల్యే రమణమూర్తిరాజు నియామక పత్రం అందజేశారు. అర్హులైన కూలీలకు జాబ్‌కార్డులు అందించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి అవసరమయ్యే రహదారులు, డ్రెయిన్లు, చెరువులు, కాలువల అభివృద్ధిపై దృష్టి సారించాలన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఏపీవో ఎరకయ్య తదితరులు పాల్గొన్నారు.

శివమాలలు ధరించిన భక్తులు



సాంబశివుని ఆలయంలో శివమాలలు ధరిస్తున్న భక్తులు

మునగపాక : మునగపాకలోని సాంబశివుని ఆలయంలో బుధవారం పలువురు భక్తులు శివమాలలు ధరించారు. 41 రోజుల దీక్షలో భాగంగా ఆలయంలో మాలధారణ చేశారు. గురుస్వామి మాడెం జోగారావు సారథ్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.


అయ్యప్ప మాలధారులకు భిక్ష ప్రారంభం



అయ్యప్పలకు అన్నసమారాధన చేస్తున్న అతిథులు

మునగపాక : అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం అన్న సమారాధన ప్రారంభమైంది. భక్తుల సౌకర్యార్థం 50 రోజుల పాటు ఆలయ ప్రాంగణంలో భిక్ష సమకూర్చేందుకు ఆలయ కమిటీ నిర్ణయించిన నేపథ్యంలో అన్న సమారాధనకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లికి చెందిన షిర్డీసాయి లా కళాశాల కరస్పాండెంట్ పెంటకోట వెంకటరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రియదర్శిని పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ వేగి వీరునాయుడు 50 స్టీల్ కంచాలు బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వేగి లక్ష్మణరావు, పెద్దలు జల్లేపల్లి కిష్టప్ప, దాడి పోలీసు, మొల్లేటి సత్యనారాయణ, మాడా కన్నారావు, తేలు నూకరాజు, కిరణ్, పెంటకోట శ్రీనివాసరావు (నెట్) తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ



సారె తీసుకెళ్తున్న భక్తులు

కోటవురట్ల: పాములవాకలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ముగియడంతో అమ్మవారిని భారీ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామంలోని మహిళలు పెద్ద సంఖ్యలో ఊరేగింపులో పాల్గొన్నారు. దుర్గమ్మకు సారెను ఊరేగింపు తీసుకెళ్లారు. గ్రామ వీధుల్లో అమ్మవారిని ఊరేగించి ప్రసాద వితరణ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు, భవానీ మాలధారులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

నేడు యండపల్లిలో ఆరోగ్య సురక్ష శిబిరం

కోటవురట్ల: యండపల్లిలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని, గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముందుగా టోకెన్లు తీసుకోని వారు కూడా శిబిరానికి వచ్చి వైద్య పరీక్షలు చేయించుకోవచ్చని చెప్పారు.

ప్రజారోగ్యమే పరమావధి



కొత్తపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు

- ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు
- కొత్తపాలెం, సిరసపల్లి, వెదురువాడ, కుమారపురం, చినదొడ్డిగల్లు ఆరోగ్య శిబిరాలకు పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీర్చిదిద్దిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రాంతం ఏదైనా ప్రజలు అనూహ్యంగా స్పందిస్తున్నారు. ఉచితంగా పరీక్షలు చేయించుకుని, మందులు తీసుకుంటున్నారు. బుధవారం యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం, సిరసపల్లి తదితర చోట్ల జరిగిన శిబిరాలకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై వైద్య సేవలు పొందారు.



టి.సిరసపల్లిలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



కొత్తపాలెం తులసీ కల్యాణ మండపంలో వైద్య పరీక్షల కోసం క్యూలో నిల్చున్న ప్రజలు



వెదురువాడ సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు



ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



చినదొడ్డిగల్లు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న గ్రామస్తులు



కొరుప్రోలు.. టి.సిరసపల్లిలో నడవలేని వ్యక్తులను శిబిరానికి తీసుకొస్తున్న నిర్వాహకులు

యలమంచిలి : ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం తులసీ కల్యాణ మండపంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారితో కలిసి సందర్శించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవల తీరును తెలుసుకున్నారు. అలాగే అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార పథకం గురించి తెలుసుకున్నారు. ప్రజారోగ్యమే పరమావధిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి పేదవాడికి కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారన్నారు. దివంగత నేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆరోగ్య శ్రీ, 108, 104 సేవలందించి మహానేతగా నిలిచిపోయారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో వైద్యం, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడంతో పేదలు ఎన్నో ఇబ్బందులు పడేవారన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రతి ఒక్కరు ఈ సేవలు వినియోగించుకోవాలని తెలిపారు. పేదలకు అన్ని విధాల అండగా ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ కమిషనర్, కె.కొండలరావు, తహశీల్దార్ రాణీ అమ్మాజీ, ఎంపీడీవో అప్పలనాయుడు, మండల అధికారి దేవీప్రసాద్, ఆర్వో నీలిమ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, డీఈ వీరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్లు బెజవాడ నాగేశ్వరరావు, అర్రెపు గుప్తా, సచివాలయ కన్వీనర్ కర్రి శివ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొద్దపు యర్రయ్య దొర, పార్టీ మండల రూరల్ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు దూది నర్సింహమూర్తి, షేక్ సయ్యిద్ బీబీ, ఎస్పైపాపినాయుడు, పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామ–వార్డు సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆరోగ్యం

నక్కపల్లి: అందరికీ ఆరోగ్యం.. అదే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి అన్నారు. చినదొడ్డిగల్లులో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. గొడిచర్ల పీహెచ్‌సీ వైద్యులతోపాటు విశాఖ నుంచి వచ్చిన వైద్య నిపుణులు రోగులకు హిమోగ్లోబిన్, బీపీ, సుగర్, మలేరియా, డెంగ్యూ, రక్తం, యూరిన్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మండల వైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో సుమారు 650 మందికి పైగా వైద్య సేవలు పొందారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చెంతకే వైద్య సేవలందిస్తోందని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పోషకాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రరావు, ఎంపీటీసీ సభ్యుడు తోట సత్తిబాబు, పరిపాలనాధికారి సీతారామరాజు, కార్యదర్శి రాజశేఖర్, వెలగా బాబ్జి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

టి.సిరసపల్లిలో..

మునగపాక : ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి భరోసాగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు అన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్‌తో కలిసి సందర్శించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారన్నారు. సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి, పార్టీ నేతలు మద్దాల నాగప్పారావు, పాలమరశెట్టి నాయుడు అప్పలనాయుడు, బొడ్డేడ జగ్గప్పారావు, మద్దాల జగ్గారావు, ఎంపీడీవో మన్మథరావు, ఈవోఆర్డీ పి.వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మోహిని తదితరులు పాల్గొన్నారు.

వెదురువాడలో..

అచ్యుతాపురం (అనకాపల్లి) : ప్రజల ఆరోగ్య రక్షణే లక్ష్యంగా సీఎం జగన్మోహన్‌రెడ్డి వైద్య రంగాన్ని బలోపేతం చేశారని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని వెదురువాడలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అంతకు ముందు పూడి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వైఎస్ఆర్ నగర్‌లో రూ. 10 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, మోల్డ్‌టెక్ ప్యాకేజింగ్ లిమిటెడ్ సహకారంతో రూ. 8.5 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌వో ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. కోఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్, కోన బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, పిన్నమరాజు వాసు, వడిశెల శ్రీనివాసరావు, గొర్లె నూకరాజు, వాసు తదితరులు పాల్గొన్నారు.

410 మందికి వైద్య పరీక్షలు

పాయకరావుపేట: మండలంలోని కుమారపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో 410 మంది వైద్య సేవలు పొందారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో పాయకరావుపేట, శ్రీరాంపురం పీహెచ్‌సీల వైద్యులు డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ తులసి నవీన రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. డాక్టర్ కనకలక్ష్మి, డాక్టర్ ఇషాక్ మహమ్మద్ ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్ పరీక్షలు జరిపారు. బీపీ, సుగర్, టైఫాయిడ్, మలేరియాతోపాటు రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం రోగులకు వైద్యులు తగు సూచనలిచ్చారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ప్రదర్శించారు. సర్పంచ్ పిరమళ్ల గోవిందమ్మ వైద్య శిబిరాన్ని సందర్శించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆమె కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ అధ్యక్షుడు నీలాపు చిరంజీవిరెడ్డి, పార్టీ నాయకులు బాలకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ పాలిక ప్రసాద్, పిరమళ్ల రామకృష్ణ, వెంకటరెడ్డి, అప్పలరెడ్డి, రాంబాబురెడ్డి, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

ఎస్.రాయవరం: ప్రతి కుటుంబంలోనూ ఆరోగ్య సమస్యలు ఉండకుండా చూడాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షిస్తున్నారని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కొరుప్రోలులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. రోగులను పలకరించి మంచి వైద్యం చేయించుకోవాలని సూచించారు. ఆరోగ్యశ్రీ ద్వారా పట్టణ ఆస్పత్రులకు తరలించే వారి వివరాలను తనకు తెలియజేయాలన్నారు. తానుకూడా ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలతో మాట్లాడి మెరుగైన వైద్య అందించాలని చెబుతానన్నారు. వైద్యులు, సిబ్బందిని ఎమ్మెల్యే బాబూరావు పలకరించి అంగన్‌వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన పోషకాహార పదార్థాలను రుచి చూశారు. స్థానిక ఆయుర్వేదిక్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న పంచకర్మ థెరపీకి మగవారికి వైద్యం చేసే వ్యక్తిని నియమించాలని ఎమ్మెల్యేను వైద్యురాలు సుజాత కోరారు. వెంటనే ఆయన ఆ శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఏర్పాటుకు కృషి చేశారు.

325 మందికి వైద్య పరీక్షలు

ఆరోగ్య సురక్ష శిబిరంలో 325 మందికి వైద్య పరీక్షలు అందించినట్టు వైద్యాధికారి రాజేశ్వరి తెలిపారు. మహిళల వైద్య నిపుణులు పి.అనూష, కంటి వైద్య నిపుణులు కృష్ణవాణి వైద్య పరీక్షలు చేశారు. సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు శక్తి ప్రియ, రాజేశ్వరి సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, ఎంఈవో పి.అప్పారావు, సర్పంచ్ సూరివేణి తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకే వైద్యం

కోటవురట్ల: పేదల చెంతకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు అన్నారు. కొడవటిపూడిలో బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ కోసూరి అప్పారావు, కాశీ విశ్వనాధరావు ప్రారంభించారు. అంగన్‌వాడీ పోషకాహార స్టాల్‌ను పరిశీలించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వైద్య శిబిరాలకు మంచి స్పందన వస్తోందన్నారు. శిబిరాల ద్వారా ప్రత్యేక వైద్య నిపుణులు రోగులను పరీక్షించి మందులు అందిస్తున్నారన్నారు. కంటి వైద్య నిపుణులు కూడా అందుబాటులో ఉండటంతో చాలా మంది సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో గోవిందరావు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కొరుప్రోలులో అంగన్‌వాడీ సిబ్బంది వంటకాల రుచి చూస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



కుమారపురంలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న సర్పంచ్ గోవిందమ్మ



కొడవటిపూడిలో పోషకాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, అధికారులు

నక్కపల్లి ఎస్ఐగా విభీషణ్‌రావు



విభీషణ్‌రావు

నక్కపల్లి: నక్కపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)గా విభీషణ్‌రావు నియమితుడయ్యారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పనిచేసిన శిరీషకు బదిలీ అయింది. ఈ సందర్భంగా విభీషణ్‌రావు మాట్లాడుతూ మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల వారితో సమన్వయమై పనిచేస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, విధుల నిర్వాహణకు అందరూ సహకరించాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానానికి ప్రాధాన్యమిస్తానన్నారు. పేకాట, కోడిపందాలు, గుళ్లాట తదితర చట్టవ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించే వారిపై కఠినంగా వ్యవహరిస్తానని, అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు, గ్రావెల్, ఇసుక, మట్టి తవ్వకాలు, దొంగతనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి, మద్యం తాగే వారికి వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ప్రతి గ్రామంలో పర్యటించి సంఘ వ్యతిరేక కార్యక్రమాల గురించి వివరిస్తామన్నారు.

ముసాయిదా రెడీ

- ఓటరు జాబితా డ్రాఫ్ట్ సిద్ధం
- 27న ప్రకటించనున్న ఈఆర్వోలు



ఇంటింటి సర్వేను తనిఖీ చేస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి జ్ఞానవేణి

యలమంచిలి (అనకాపల్లి రూరల్) : తాజాగా నవీకరించిన ఓటరు ముసాయిదా జాబితా ప్రకటనకు అధికారులు అంతా సిద్ధం చేశారు. ఈ నెల 27న ముసాయిదాను ప్రకటించనున్నారు. జాబితా ప్రకారం యలమంచిలి నియోజకవర్గంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారని తేలింది. పురుషుల ఓట్ల కంటే 4767 ఓట్లు అధికంగా ఉన్నాయి. గత జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికార యంత్రాంగం ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ చేపట్టింది. తాజా ముసాయిదా జాబితా ప్రకారం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,02,732గా ఉంది. ఇందులో పురుషులు 98,975 మంది కాగా మహిళా ఓటర్ల సంఖ్య 1,03,742గా తేలింది. ఇక 15 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 2024 జనవరి 1వ తేదీకి 18 ఏళ్లు నిండే వారిని కొత్త ఓటర్లుగా నమోదు చేశారు. ఈసారి ఓటర్ల జాబితా నవీకరణలో 7204 మంది కొత్త ఓటర్ల నమోదు, 12,829 మంది పేర్ల తొలగింపు జరిగింది. చిరునామాలు మార్పు చేసుకున్న ఓటర్లు 11,348 మంది ఉన్నారు.

జనవరి 5న తుది జాబితా..

ముసాయిదా ఓటర్ల జాబితాను అధికారులు ఎన్నికల కమిషన్‌కు పంపించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రజలందరూ చూసేందుకు వీలుగా ఆ ముసాయిదా ఓటర్ల జాబితాను ఈ నెల 27న ప్రదర్శిస్తారు. అనంతరం జాబితాలో ఏవైనా అభ్యంతరాలుంటే ప్రజల నుంచి డిసెంబరు 9 వరకూ అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఇందుకోసం వచ్చే నవంబరు 4,5 తేదీలు, డిసెంబరు 2,3 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు సైతం నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

పారదర్శకంగా జాబితా సవరణ



నియోజకవర్గంలో ఓటర్ల జాబితాను అత్యంత పారదర్శకంగా రూపొందించాం. ఈ నెల 27న ముసాయిదా జాబితా ప్రదర్శిస్తాం. ఆ జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే డిసెంబరు 9లోగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి ఒక్కరూ జాబితాలో ఓటు ఉందో లేదో సరి చూసుకోవాలి. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటూ పోరాదనే ఉద్దేశంతో పటిష్ట చర్యలు తీసుకున్నాం.

- కె. జ్ఞానవేణి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి, యలమంచిలి

భారీ అన్న సమారాధన

రాంబిల్లి: దిమిలి గ్రంథాలయ ఆవరణలో బాలా త్రిపుర సుందరి అమ్మవారి సన్నిధిలో బుధవారం రాత్రి భారీ అన్న సమారాధన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. నారాయణపురం తదితర గ్రామాల్లోనూ దుర్గమ్మ తల్లి నిమజ్జనోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కర్రి సీతారామ్‌కు నివాళి



కర్రి సీతారామ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన కర్రి సీతారామ్ సేవలను పలువురు కొనియాడి, అతని చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఆయన భౌతికంగా దూరమైనప్పటికీ ఆయన ఆశయాలు మాత్రం సజీవంగా ఉన్నాయని పేర్కొన్నారు. జనమిత్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో శివబాపునాయుడు, శరగడం జగ్గారావు, కర్రి అప్పారావు, శరగడం రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



ఆంజనేయ స్వామిని దర్శించుకుంటున్న నాగరాజు

రాంబిల్లి : హరిపురం పంచాయతీ పరిధిలో గల అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, సర్పంచ్ ధూళి దేవుడమ్మ, సచివాలయ కన్వీనర్ ధూళి అప్పారావు (బుజ్జి), కమిటీ చైర్మన్ ఈశ్వరరావు, సూర్యచంద్ర, నంద స్వామికి ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తపాలెంలో అమృత్ కలశ యాత్ర



అమృత్ కలశ యాత్రలో ఎమ్మెల్యే కన్నబాబురాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి

యలమంచిలి (అనకాపల్లి రూరల్) : మేరీ మట్టి–మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెంలో బుధవారం అమృత్ కలశ యాత్రను ఘనంగా నిర్వహించారు. పురపాలక సంఘంలోని ప్రతి గ్రామం నుంచి సేకరించిన మట్టిని ఒకచోట చేర్చిన అధికారులు కొత్తపాలెంలో ప్రదర్శించారు. హాజరైన ఎమ్మెల్యే కన్నబాబురాజు మాట్లాడుతూ ప్రతి పౌరుడికి దేశభక్తి అవసరమన్నారు. ఈ మట్టితో ఢిల్లీలో అమృత వాటిక నిర్మిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ పిల్లా రమాకుమారి చెప్పారు. ఎంపీపీ బోదెపు గోవిందు, మున్సిపల్ కమిషనర్ కొండలరావు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొద్దపు ఎర్రయ్యదొర, డీఈఈ వీరయ్య, మర్రి రాజు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాధ్యతగా పాఠశాల పరిశుభ్రత



హైస్కూల్ భవనానికి ఆనుకుని ఉన్న తుప్పలను పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు

ఎస్.రాయవరం: పాఠశాలల్లో పారిశుధ్య సమస్య తలెత్తితే సహించేది లేదని, ఉపాధ్యాయులు బాధ్యత వహించి పరిశుభ్రం చేయించాలని ఎంఈవో పి.అప్పారావు సూచించారు. కొరుప్రోలు ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన స్కూల్ పరిసరాలను పరిశీలించారు. దసరా సెలవుల తరువాత తెరచుకున్న పాఠశాలలో భవనాలకు ఆనుకుని పిచ్చితుప్పలు పెద్ద ఎత్తున కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి రెండు రోజుల్లో పాఠశాలలో పిచ్చితుప్పలు తొలగించాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణకు ఎంఈవో అప్పారావు సూచించారు.

ఘనంగా ఏకాహం



కీర్తనలు ఆలపిస్తున్న భజన భక్తులు

నక్కపల్లి: దేవీ నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం కాగితలో ఏకాహం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కాగిత, ఉద్దండపురం, చినదొడ్డిగల్లు, పెనుగొల్లు, చందనాడ, వేంపాడు, నక్కపల్లి తదితర గ్రామాలకు చెందిన భజన బృందాలు ఇక్కడ 24 గంటల పాటు ఏకధాటిగా భజన కీర్తనలు ఆలపించారు. ఇక్కడి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు ఘనంగా జరిగాయి. వివిధ వేషధారణలతో చేపట్టిన బళ్ల వేషాల ప్రదర్శన గ్రామస్తులను ఆకట్టుకుంది.

ఏపీవో ఎరకయ్యకు సత్కారం



ఏపీవో ఎరకయ్యను సత్కరిస్తున్న అతిథులు

మునగపాక : అధికారులు బాధ్యతగా విధులు నిర్వర్తిస్తే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. విధుల్లో రాణించిన ఉపాధి హామీ పథకం ఏపీవో ఎరకయ్యను ఆమె సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, సిరసపల్లి సర్పంచ్ ధనలక్ష్మి నాగప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు వీరునాయుడు, సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి అప్పారావు, ఎంపీడీవో మన్మథరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.